సంక్రాంతి సంబరాలు కనుమా

మదనపల్లె సిటీ: మదనపల్లెలో సోమవారం సంక్రాంతి పండుగ సంబరాలను వేడుకగా నిర్వహించారు. స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి పండుగను నిర్వహించారు. మట్టి పొయ్యిలు ఏర్పాటు చేసి చెరకు గడలను నిలబెట్టి,పాలు పొంగించారు. వెలుగు కన్వీనర్ ఉదయ మోహన్‌రెడ్డి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. బర్మావీధిలోని సాయిబాబా ఆలయంలో , శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయం, దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

కనుమ పండుగ సంబరాలు

తంబళ్లపల్లె: మండలంలో మంగళవారం పల్లెల్లో కనుమ పండుగ సంబరాలను కనువిందుగా జరుపుకున్నారు. ఎద్దులు, పాడి ఆవులను అలంకరించి బాణాసంచా పేలుళ్లు, డప్పుల వాయిద్యాలతో గ్రామ పొలిమేర సరిహద్దులో వెలసిన కాటమరాజు గుడి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. చిట్లాకుప్పను తగల పెట్టి ఆ వెలుతురులో పశువులను బెదిరించి ఆనందాన్ని పంచుకున్నారు.

జంగావారిపల్లెలో జోరుగా పశువుల పండగ

కురబలకోట: సంక్రాంతితో పల్లెలు కొత్త శోభను సంతరించుకున్నాయి. కనుమ రోజు మంగళవారం పశువుల పండగను ఘనంగా నిర్వహించారు. జంగావారిపల్లెలో అత్యంత ఘనంగా జరిగింది. ఆదిరి రైతు జంగా నరేంద్ర రెడ్డి పశువులు కన్పించనంతగా బెలూన్లు కట్టి ప్రత్యేకతను చాటుకున్నారు. ఊరంతా కూడా పోటాపోటీగా పశువులకు నిండుగా ఎత్తుగా బెలూన్లు కట్టడంతో చూపరులను ఆకట్టుకున్నాయి. కాటమరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు.

సాంప్రదాయ బద్ధంగా సంక్రాంతి సంబరాలు

కలకడ: కె.బాటవారిపల్లె పంచాయతీ గరడప్పగారిపల్లె, కోన పంచాయతీ తిప్పిగారిపల్లె, తది తర గ్రామాలలో పండుగ ఘనంగా జరిగింది. పెద్దల సమాధుల వద్ద పూజలు చేసి నివాళి అర్పించారు. అనంతరం పశువులను అలంకరించి, ఊరేగింపుగా చిట్లాకుప్పవద్దకు తరలించి డప్పువాయిద్యాలతో పశువులను బెదిరించి అగ్రిమండుతున్న చిట్లాకుప్ప చుట్టూ ప్రదక్షణలు చేయించారు.


గుర్రంకొండలో చిట్లాకుప్పకు నిప్పు అంటించి పాడిఆవులను మంటల చుట్టూ తిప్పుతున్న దృశ్యం


గుర్రంకొండలో అందంగా అలంకరించిన పాడిఆవులు


వాల్మీకీపురం: ఆకట్టుకున్న ముగ్గులు

ఉత్సాహంగా కనుమ పండుగ వేడుకలు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండతో పాటు పలు గ్రామాల్లో కనుమ పండుగ వేడుకలను మంగళవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. పలుచోట్ల మేళతాళలతో డీజే విన్యాశాలతో పాడిఆవులను ఊరేగింపుగా గ్రామాలకు సమీపంలో ఉన్న చిట్లాకుప్ప వద్దకు తీసుకొచ్చారు. పాడిఆవులు రోగాల బారిన పడకుండా కాపాడమంటూ రైతులు మొక్కులు చెల్లించుకొన్నారు. అందంగా అలంకరించిన పాడిఆవులకు నిర్వాహకు లు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం చిట్లాకుప్పకు నిప్పు అంటించారు.

ఘనంగా పశువుల పండుగ

రామసముద్రం: రామసముద్రం మండలంలోని అనేక గ్రామాల్లో పశువుల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆర్.నడింపల్లె, రామసముద్రం, మాలేనత్తం పంచాయతీలు, నరసాపురం, వనగానిపల్లె తదితర పంచాయతీ గ్రమాల్లో పశువుల పండగ ఘనంగా నిర్వహించారు. రాత్రి గ్రామంలోని కాటమరాజుల ఆలయం వద్ద శాంతి పూజలు చేసి, చిట్లకంపలు వేశారు.

అంబరాన్నంటిన సంబరాలు

పీలేరు : పీలేరు పట్టణంలోని సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక కావలిపల్లెలో కర్ణాటక కళాకారులతో వివిధ వేషధారణలు, బళ్లారి డ్రమ్స్, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కావలిపల్లె తోపాటు కామాటంపల్లె వద్ద కనుమ పండుగను మంగళవారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పశువులను బెలూన్‌లు, వివిధ రకాల పూలతో అలంకరించారు. బళ్లారి డ్రమ్స్ మధ్య యువకులు కేరింతలు కొడుతూ పశువులను బెదిరిస్తూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం చిట్లాకుప్పకు నిప్పంటించారు. పండుగ సందర్భంగా ప్రత్యేక అలంకరణ, శరీర దారుఢ్యంగల పశువులకు బహుమతులు ప్రధానం చేశారు. అలాగే ముగ్గులు, పతంగుల, మ్యూజికల్ చైర్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.పలుచోట్ల ముస్లింలు కూడా తమ పశువులకు అలంకరించడం విశేషం.

చల్లంగుండాలని..

కేవీపల్లె : మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటిముందు మహిళలు శోభాయమానంగా ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఉదయం ఇంటిముందు చల్లపెట్టి అనంతరం గ్రామస్తులంతా మూకుమ్మడిగా తీసుకెళ్లి గ్రామ సమీపంలో మంచినీటి బావుల్లో, చెరువుల్లో వేశారు.

ఆకట్టుకున్న ముగ్గులు

వాల్మీకిపురం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలో మహిళలు వారి వారి ఇళ్ల ముందు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గిపిండితో ముగ్గులు వేసి, కల్లర్లతో నింపి, ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలను పెట్టి చూపరులను ఆకట్టుకునే విధంగా ముగ్గను ఏర్పాటు చేశారు.

కలికిరి: మండలంలోని పలు గ్రామాలలో ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముందు రంగవళ్ళులు వేసి, గొబ్బెలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం పశువులను వివిధ రూపాల్లో బెలూన్‌లు, ముసుగులు ధరింపచేసి కాటమరాజు వద్దకు తరలించి పూజలు, చిట్లాకుప్పకు నిప్పు పెట్టిన అనంతరం ప్రదక్షిణలు చేయించి ఇంటికి తరలించారు. గ్రామాల్లో ప్రత్యేక సందడి నెలకొంది.


కేవీపల్లె : గుర్రెడ్డిగారిపల్లెలో చల్ల తీసుకెళుతున్న భక్తులు


కలికిరి రెడ్డివారిపల్లిలో చిట్లాకుప్ప దృశ్యం


పీలేరులో చిట్లాకుప్పకు నిప్పు పెట్టిన దృశ్యం


పీలేరు: పశువులను అందంగా అలంకరించిన రైతు

డ్రైవింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

పీలేరు రూరల్ : డ్రైవింగ్ చేసే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాలు ప్రమాదాలకు గురి కాకుండా డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పీలేరు డిపోను జీరో ఆక్సిడెంట్ డిపోగా పేరు తీసుకు రావడానికి డ్రైవర్లు కృషి చేయాలని సూచించారు. డీఎం కుమార్, గ్యారేజీ ఇన్‌చార్జి హరినాథ్‌రెడ్డి, టీఐ-2 రెడ్డెప్ప, ఎస్‌డీఐ ఆనంద్, ఆయిల్ డీసీ మోహన్, యూనియన్ నాయకులు పీఎస్ఎం. రాజు పాల్గొన్నారు.

నిరాశ్రయుడికి చేయూత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన దుగ్గి నరేష్ అనే యువకుడు రేకుల షెడ్డులో టైలరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత నెలలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో షెడ్డుతో పాటు కుట్టు మిషన్లు, దుస్తులన్నీ కాలి బూడిద కావడంతో ఉపాధి కోల్పోయి నిరాశ్రయుడయ్యాడు. ఈ నేపథ్యంలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారు బాధితుడికి ఉచితంగా కుట్టు మిషన్ అందజేసి మానవత్వం చాటుకున్నారు. సర్పంచ్ శివాల లోకేష్, మునిరెడ్డి, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసులు సమక్షంలో కుట్టుమిషన్ అందజేశారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

పీలేరు : చింతలబైలు ఎస్టీ కాలనీలోని గిరిజనులకు గిరిజన యానాది సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు చలి నంచి ఉపశమనం కల్గించడానికి తమవంతు సాయంగా దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. జానం సుజాత, పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం

వాల్మీకిపురం: స్థానిక కోనేటివీధిలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

కలకడ : త్రైతసిద్ధాంతప్రబోధ సేవాసమితి పీలేరు కమిటీ అధ్యక్షులు రామక్రిష్ణ మంగళవారం మండలంలోని నడిమిచెర్ల, అగ్రహారం, వడ్డిపల్లె గ్రామాలలో పర్యటించి భగవద్గీత అనుబంధ గ్రంథాలను పంపిణీ చేశారు. అన్ని కులాలకు, మతాలకు భగద్గీత సారాంశం తెలియజేయడమే లక్ష్యంగా గ్రామాల పర్యటన చేస్తున్నట్లు వివరించారు. ఆసంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పదవి నుంచి తప్పుకోండి

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ బాల అయ్యప్పస్వామి ఆలయ చైర్మన్ సి.రెడ్డప్పరెడ్డి చైర్మన్ పదవి నుంచి తప్పుకోవాలని బహుజన యువజన రాష్ట్ర అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చైర్మన్‌పై ఇటీవల పలు ఆరోపణలు వచ్చాయన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కలెక్టర్, దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదులు చేశామన్నారు. చైర్మన్ పదవికి రాజీనామా చేయకముందే ఆలయానికి సంబంధించిన దాతల విరాళాలు, కానుకలు, ఇతర జమ, ఖర్చుల వివరాలన్నింటిని దేవదాయశాఖ అధికారులకు అప్పగించి వెళ్లాలన్నారు. ఇందులో దేవదాయశాఖ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. అయ్యప్పభక్తులు హేమంత్, కేశవ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై దేవదాయశాఖ ఈఓ రమణ మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశిస్తే ఆలయంలోని రికార్డులు స్వాధీనం చేసుకుంటానన్నారు.

ఘనంగా తిరుణాల

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం తిరుణాల వైభవంగా జరిగింది. స్థానిక బెంగుళూరు రోడ్డు నుంచి ఆలయం వరకు రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఉదయంస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి బంగారు ఆభరణాల పెట్టెను వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. అయ్యప్ప మాలధారులు అయ్యప్ప శరణఘోషలతో 18 మెట్లు ఎక్కి స్వామివారికి ఇరుముడులు చెల్లించారు. అర్చకులు కార్తీక్ ప్రత్యేక పడిపూజలు చేశారు. హాజరైన భక్తులకు దాతలు అన్నదానం చేశారు.

సీపీఐ కమిటీల ఎన్నిక

బి.కొత్తకోట: బి.కొత్తకోట, పట్టణ సీపీఐ కమిటీలను ఎన్నుకున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బి.కొత్తకోట మండల కార్యదర్శిగా చిన్నరెడ్డెప్ప, పట్టణ కార్యదర్శిగా ఎం.అష్రఫ్ అలీలను ఎన్నుకున్నామని పేర్కొన్నారు.

బహుమతుల పంపిణీ


టోర్నీ విజేతలతో క్రీడాకారులు

పెద్దతిప్పసముద్రం: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని తుమ్మరకుంటలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి బహుమతి గెలుపొందిన వారికి స్థానికుడైన పీ.రమణ, రూ.5 వేలు నగదు అందజేయగా రెండవ బహుమతి విజేతలకు రూ.2.500ల నగదును యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, టీం సభ్యులు అందజేసారు. ఆర్గనైజర్స్ నాగార్జున, శ్రీనాథ్, చిన్ని డేవిడ్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

పీలేరు : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో గోదాదేవి, రంగనాథుడిని శోభాయమానంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ సాంప్రదాయ బద్ధంగా కల్యాణం జరిపించారు. ఆర్యవైశ్యులు స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి అమ్మవారిని పల్లకిలో కోలాటాల నడుమ ఊరేగించారు.


గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న ఆర్యవైశ్యులు

సాహితీ ప్రపంచంలో ధ్రువతార మునవ్వర్ రానా

మదనపల్లె సిటీ: సాహితీ ప్రపంచంలో ధ్రువతార మునవ్వర్ రానా అని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కలీం అన్నారు. మంగళవారం స్థానిక మార్పురివీధిలోని ఉర్దూ అకాడమీ కంప్యూటర్ సెంటర్, ఉర్దూ లైబ్రరీలో ఆయన సంతాప సభ నిర్వహించారు. ఉర్దూ, అవధీ బాషలలో వేలాది కవితలు రాసి ఉర్దూ సాహిత్యానికి ఎనలేని సేవలు అందించిన మునవ్వర్ రానా మృతి బాధాకరమన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్‌ఖాన్, ఉపాధ్యాయులు సయ్యద్‌హాషిం, నాయబ్ షరాఫత్ అలీఖాన్, ఉర్దూ లైబ్రరీ, కంప్యూటర శిక్షణా కేంద్ర సిబ్బంది షౌకత్, వాజిద్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉర్దూ అకాడమీ డైరెక్టర్ కలీం

మునవర్ రాణా సేవలు ఎనలేనివి

వాల్మీకిపురం: మహాకవి మునవర్ రాణా చేసిన సాహితీ సేవ ఎనలేనిదని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. మంగళవారం స్థానిక ఉర్దూ పాఠశాలలో ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ ఉర్దూ కవి మునవర్ రాణా సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి మునవర్ రాణా ఆధునిక ఉర్దూ సాహిత్యానికి విశేష సేవలు అందించారని, తన కవిత్వంలో మాతృమూర్తి విశిష్టతను, గొప్పదనాన్ని చాలా చక్కగా, అందంగా అభివర్ణించారన్నారు. విశ్రాంత హెచ్ఎం అమీర్ హుస్సేన్, బషీర్ అహ్మద్, దస్తగిరి సాహెబ్, సయ్యద్ కరీం సాహెబ్, సయ్యద్ గఫార్ సాహెబ్, అహ్మద్ షరీఫ్, ఆబిద్ హుస్సేన్, జాహెద్ హుస్సేన్, ఫైరోజ్ అలీ ఖాన్, మహమూద్ బేగ్, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండ అభివృద్ధిపై ప్రశంసలు

తంబళ్లపల్లె: శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయ పునఃనిర్మాణం, రోడ్డు నిర్మాణానికి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషి ప్రశంసనీయమని న్యాయమూర్తులు ప్రశంసించారు. పండుగ సందర్భంగా మండలంలోని కోసువారిపల్లెకు చెందిన రాజంపేట కోర్టు న్యాయమూర్తి పి.కేశవరెడ్డి, సతీమణి కడప కోర్టు న్యాయమూర్తి కె.భార్గవి సోమవారం మల్లయ్యకొండను సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు న్యాయమూర్తుల దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలతో దర్శనం కల్పించారు కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్ మల్లిరెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎంపీ డాక్టర్ రమణారెడ్డి, రామలింగారెడ్డి తదితరులు ఉన్నారు.

టోర్నీ విజేత నూతనకాల్వ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సాహిత్

కేవీపల్లె : సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని మండలంలోని నూతనకాల్వలో నిర్వహించిన పీవీ మిథున్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నూతన కాల్వ జట్టు నిలిచింది. మంగళవారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సాహిత్‌రెడ్డి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

మదనపల్లె : టమాటా మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా నూతన మార్కెట్‌కమిటీ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని అన్నమయ్యజిల్లా బలిజ సేవాసమితి కో ఆర్డినేటర్ పవన్‌తేజ వినతి చేశారు. మంగళవారం మార్కెట్‌కమిటీ నూతన అధ్యక్షులుగా తట్టిశ్రీనివాసులురెడ్డి నియామకం జరిగినందుకు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. మదనపల్లె మార్కెట్‌యార్డులో తాగునీటివసతి, పారిశుధ్య నిర్వహణ, రైతు విశ్రాంతి గదులు తదితర సమస్యలు చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. టమాటాకు సంబంధించి రైతుకు కనీసమద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండామారిపల్లె ఇస్మాయిల్, సేవానంద ట్రస్ట్ వ్యవస్థాపకులు టీఎస్.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విన్నర్-కోన కింగ్స్


విజేత జట్టుకు నగదు, కప్ అందజేస్తున్న హెచ్చెం మోడెం. చంగల్‌రాయుడు, తదితరులు

కలకడ : సంక్రాంతి సంబరాల్లో బాగంగా కోన ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రామ క్రీడాకారులకు నిర్వహించిన వాలీబాల్ ఆటల పోటీలలో కోన కింగ్స్ జట్టు విజయం సాధించి మొదటి ప్రైజ్‌మని సాధించినట్లు నిర్వాహకులు కిరణ్‌కుమార్, మోహన్‌కుమార్ తెలిపారు. విన్నర్ జట్టుకు కోన ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు మోడెం. చంగల్‌రాయుడు బహుమతి ప్రదానం చేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

– వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకు నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పిలుపునిచ్చారు. మంగళవారం 6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన పట్టణంలోని గొల్లపల్లె రింగ్‌రోడ్డులో డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్లుతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో ఈనెల 19న జరగనున్న సామాజిక న్యాయ మహా శిల్పం, డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ స్మృతి వనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్స్ ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ... దళితుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి సంబంధించి దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అనేక పథకాలు అమలులో ఉన్నాయన్నారు. బడుగు, బలహీనవర్గాలకు అంబేడ్కర్ ఆశాజ్యోతి అని, ఈ నేపథ్యంలో ఆయన విగ్రహా ఆవిష్కరణ రోజు అందరికీ పండుగన్నారు. సామాజిక న్యాయానికి ప్రతిరూపంగా, నిదర్శనంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జనవరి 19న విజయవాడలో జరిగే సామాజిక న్యాయమహాశిల్పం, అంబేడ్కర్ సామాజిక స్మృతివనం ఆవిష్కరణోత్సవంలో ప్రజలందరినీ భాగస్వాములు చేస్తూ అధికారికంగా ఏర్పాట్లు చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ చేనేతవిభాగం జిల్లా అధ్యక్షులు భువనేశ్వరిసత్య, సీటీఎం క్రాస్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బండపల్లివెంకటరమణ, కౌన్సిలర్లు కరీముల్లా, ముబీనా పాల్గొన్నారు.


సామాజిక న్యాయ మహాశిల్పం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిసార్‌అహ్మద్ తదితరులు

26న వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

మదనపల్లె : మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం జనవరి 26న నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తెలిపారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యా లయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశానికి వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని వివరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో గెలుపు జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాబ్‌జాన్, మున్సిపల్ చైర్మన్ మనూజారెడ్డి పాల్గొంటారన్నారు.

● మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశానికి అధికసంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు.